15న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 15వ తేదీ శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఉదయం పది గంటలకు రెండు, ఐదో స్థాయీ సంఘ సమావేశాలు, 11 గంటలకు 3,4, మధ్యాహ్నం 12 గంటలకు 1,6,7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. సంబంధిత అధికారులు తమ శాఖల ద్వారా అమలుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికలతో జడ్పీ సమావేశ మందిరానికి హాజరుకావాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీకి ఆటంకాలు

రైతులకు యూనిక్ కోడ్ నంబరు కేటాయింపులో రెవెన్యూ చిక్కులు

- పలు గ్రామాల్లో వెబ్‌ల్యాండ్‌లో కనిపించని భూముల వివరాలు
- ఈ నెల 25తో ముగియనున్న నమోదు గడువు



ఎలమంచిలి మండలం రామారాయుడుపాలెం రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ కోసం వచ్చిన రైతులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రతి రైతుకు ఆధార్ తరహాలో 14 అంకెల యూనిక్ కోడ్‌తో (ఫార్మర్ రిజిస్ట్రీ) కార్డులను జారీ చేయడంలో రెవెన్యూ సిబ్బందికి చిక్కులు ఎదురవుతున్నాయి. జనవరి 26న ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీతో ముగించాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ పలు మండలాల్లో ప్రభుత్వ వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాలు కనిపించకపోవడం, వివరాలు ఉన్నప్పటికీ లోపభూయిష్ఠంగా నమోదవడం వంటి కారణాలతో కార్డుల జారీ మందకొడిగా సాగుతున్నది.

వ్యవసాయ శాఖ వద్ద వున్న లెక్కల ప్రకారం జిల్లాలో 2,80,524 మంది రైతులకు 14 అంకెలతో ఆధార్ తరహాలో కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం భావించింది. జనవరి 26వ తేదీన వెబ్‌పోర్టల్‌ను అధికారులు ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీలోగా శత శాతం రైతులకు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని రైతు సేవా కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. అయితే వివిధ కారణాల వల్ల బుధవారం నాటికి 1,95,558 మంది రైతులకు మాత్రమే యూనిక్ కోడ్ నంబర్లను కేటాయించారు. ఇంకా 84,966 మంది రైతులకు నంబర్లు కేటాయించాల్సి ఉంది. వీరిలో సుమారు 35 వేల మంది రైతులకు కోడ్‌లను కేటాయించేందుకు సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా రైతుల ఆధీనంలో ఉన్న అటవీ శాఖ సెటిల్‌మెంట్ భూముల వివరాలు, ఇనాం, డి.పట్టా, దేవదాయ శాఖ భూముల వివరాలు రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదని తెలిసింది. ఇంకా కొంతమంది రైతుల జిరాయితీ భూములకు సంబంధించి పేర్లు, చిరునామా, బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లు వెబ్‌ల్యాండ్‌లో తప్పుగా నమోదు కావడంతో ఆయా రైతుల వివరాలు అప్‌లోడ్ కావడంలేదని వ్యవసాయ సిబ్బంది అంటున్నారు.

వివిధ మండలాల్లో 42 గ్రామాల్లో సగం మంది రైతుల భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదని చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో యూనిక్ కోడ్‌ల కేటాయింపు పెండింగ్‌లో పెట్టారు. మాడుగుల మండలంలో రెండు గ్రామాలు, ఎస్.రాయవరం మండలంలో మూడు, దేవరాపల్లి మండలంలో రెండు, మునగపాకలో రెండు, అచ్యుతాపురంలో ఒక గ్రామానికి సంబంధించి రైతుల భూముల వివరాల వెబ్‌ల్యాండ్‌లో కనిపించడం లేదని తెలిసింది.

దీనిపై జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా, రెవెన్యూ పరంగా సమస్యలు ఎదురైన రైతుల వివరాలను సంబంధిత మండల రెవెన్యూ అధికారుల దృష్టిలో పెడుతున్నామన్నారు. గడువులోగా యూనిక్ కోడ్ నంబర్లు కేటాయించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఒకవేళ గడువులోగా నంబర్ల కేటాయింపు జరగకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



నూకాంబిక అమ్మవారి బాలాలయంలో జీవో కాపీలకు పూజలు నిర్వహిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

రాష్ట్ర పండుగగా నూకాంబిక అమ్మవారి జాతర

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జీవో కాపీలకు అమ్మవారి బాలాలయంలో పూజలు

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కూటమి నాయకులు ఆనందోత్సవాలు నిర్వహించారు. కూటమి అధికారంలోకి వస్తే నూకాంబిక అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహించేలా కృషి చేస్తానని గత ఏడాది ఎన్నికల ముందు జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందించారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బుధవారం సాయంత్రం కూటమి పార్టీల నాయకులు ఆలయ ఆవరణలో మిఠాయిలు పంచి బాణసంచా వెలిగించారు. జీవో కాపీలకు అమ్మవారి బాలాలయంలో పూజలు నిర్వహించారు. పంచలోహ ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.సుజాత, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె. శోభారాణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు విస్తరణకు సర్వే

మండల కేంద్రాల్లో 80 అడుగులు, ఇతరచోట్ల 100 అడుగుల మేర రోడ్డు నిర్మాణం



రెండు లేన్లతో స్టేట్ హైవేగా విస్తరించనున్న బీఎన్ రోడ్డు

- ఇరువైపులా ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాల సేకరణ
- నిర్వాసితులకు నష్టపరిహారంపై అంచనాలు
- అధికారులతో ఎమ్మెల్యే రాజు సమావేశం

చోడవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద జిల్లాలో చేపట్టనున్న భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు అభివృద్ధికి సంబంధించి సర్వేకు రంగం సిద్ధమైంది. స్టేట్ హైవేగా రెండు లేన్లతో విస్తరించేందుకు ఎల్‌ఈఏ సంస్థ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. రోడ్డుకు ఇరువైపులా భూములు, స్థలాలు పోతున్న వారి వివరాలు సేకరించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నాలుగు మండలాల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రాల్లో 80 అడుగులు, ఇతరచోట్ల వంద అడుగుల మేర మార్కింగ్ చేసి, ఆ మేరకు స్థలాల వివరాలు, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపునకు సంబంధించి నివేదిక సిద్ధం చేయాలని ఆయన సూచించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారులను అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించింది. ఇటీవల ఆయా రహదారుల జాబితాను కూడా విడుదల చేసింది. రెండవ ప్యాకేజీలో సబ్బవరం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డు వుంది. దీనిని పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ఎల్‌ఈఏ సంస్థ ముందుకు వచ్చింది. ఈ సంస్థ డీపీఆర్ తయారీకి సిద్ధమవుతున్నది. సబ్బవరం నుంచి చోడవరం, వడ్డాది, కొత్తకోట మీదుగా నర్సీపట్నం వరకు సుమారు 81 కిలోమీటర్ల మేర రెండు లేన్ల రోడ్డు నిర్మించనున్నారు. మధ్యలో నదులు, గెడ్డలు, వాగులు, పంటకాలువలపై వంతెనలు/ కల్వర్టులు నిర్మిస్తారు. రోడ్డు అందుబాటులోకి వచ్చిన తరువాత సదరు సంస్థ 30 సంవత్సరాలపాటు వాహనదారుల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తుంది. రోడ్డు నిర్మాణానికి సేకరించే జిరాయితీ భూములకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. రోడ్డు నిర్మాణానికి

... మిగతా 8వ పేజీలో

సచివాలయాల ప్రక్షాళన

- క్లస్టర్ల వారీగా సిబ్బంది విభజన
- జనాభా ప్రాతిపదికన సర్దుబాటు
- 3,500 ప్లస్ జనాభా ఉంటే ఎనిమిది మంది ఉద్యోగులు
- 2,500-3,500 జనాభాకు ఏడుగురు..
- 2,500 కన్నా తక్కువ జనాభా ఉంటే ఆరుగురు సిబ్బంది
- ఇంకా మిగిలితే సంబంధిత శాఖలకు కేటాయింపు



గ్రామ సచివాలయం

అనకాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

గ్రామ/ వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనాభా ఆధారంగా సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతో జిల్లాలో వున్న 522 గ్రామ/ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి కస్టర్ల వారీగా సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల్లో సగటున 11 మంది చొప్పున ఉద్యోగులు వుండాలి. ఈ ప్రకారం జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో 5,742 మంది వుండాలి. అయితే గత ప్రభుత్వం పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కేడర్లకు చెందిన ఉద్యోగులు 3,422 మంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. కొన్ని సచివాలయాల్లో పది మందికిపైగా సిబ్బంది వుండగా, అత్యధిక సచివాలయాల్లో సగంకన్నా తక్కువ మంది వున్నారు. కొన్నిచోట్ల ఇద్దరు, ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్న సచివాలయాల్లో చాలామందికి

... మిగతా 8వ పేజీలో

ప్రజా ఉద్యమకారుడు నాగులాపల్లి కన్నుమూత

బుచ్చెయ్యపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):



నాగులాపల్లి సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

ప్రజా ఉద్యమకారుడు, రాజాం మాజీ సర్పంచ్ నాగులాపల్లి సత్యనారాయణ (62) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మంగళవారం రాత్రి రాజాంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు బిడ్డలు వున్నారు. వామపక్ష భావజాలం వున్న సత్యనారాయణ ప్రజల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారు. సిరిల్‌రెడ్డి, గద్దర్, వంగపండు ప్రసాదరావు, మేధాపాట్కర్, తమ్మారెడ్డి భరద్వాజ వంటివారితో కలిసి పనిచేశారు. కొద్దికాలం పీపుల్స్ వార్ గ్రూపులో (ప్రస్తుత మావోయిస్టు పార్టీ) పనిచేసిన ఆయన నాటి ప్రభుత్వ పిలుపుమేరకు జనజీవన స్రవంతిలో

... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురు)	6.11
సహరి (శుక్ర)	4.51

దశ తిరిగిన సెజ్ రోడ్లు

- కూటమి హయాంలో రూపురేఖలు మారిన ప్రధాన రహదారి

నాడు



నేడు



పూడిమడక రోడ్డులో మైలురాయి వంతెన వద్ద ..

అచ్యుతాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లో రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. గోతులు లేని రహదారులపై సాఫీగా ప్రయాణం సాగిపోతున్నది. అచ్యుతాపురం జంక్షన్ నుంచి పూడిమడక వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డును ఏపీఐఐసీ స్వాధీనం చేసుకొని నాలుగు లేన్లుగా విస్తరించి అభివృద్ధి చేసింది. నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు, వ్యాన్లు, బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాల కారణంగా రహదారి పలుచోట్ల దెబ్బతిన్నది. అయితే వైసీపీ హయాంలో ఒక్కసారి కూడా రహదారికి మరమ్మతులు చేయలేదు. దీంతో గోతులు మరింత అధికమై వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 'సెజ్' ప్రధాన రహదారికి మోక్షం కలిగింది. గోతులు పూడ్చడంతోపాటు కొత్తగా బీటీ లేయర్ వేశారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు



నేడు



ఏపీఐఐసీ కార్యాలయం జంక్షన్ వద్ద..

వైసీపీ 'యువత పోరు'

- పార్టీ ఆఫీసు నుంచి కలెక్టరేట్‌కు బైక్ ర్యాలీ
- డీఆర్వోకు వినతిపత్రం
- పోరులో కానరాని యువత, విద్యార్థులు



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్/కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నాయకులు బుధవారం 'యువత పోరు' పేరుతో ఇక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి భీమునిగుమ్మం, నాయుళ్ల వీధి, నెహ్రూచౌక్, మెయిన్‌రోడ్డు మీదుగా శంకరంలోని కలెక్టరేట్‌కు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగులకు భృతి అందజేయాలని, కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టాల్సి వస్తున్నదని అన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామన్న హామీని తొమ్మిది నెలలైనా అమలు చేయలేదని అన్నారు. అనంతరం డీఆర్వో సత్యనారాయణరావుకు

... మిగతా 8వ పేజీలో

అసంపూర్తి ఇళ్లకు అదనపు సాయం

- ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీలకు రూ.లక్ష

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీజీటీ లబ్ధిదారులకు ఈ సహాయం పొందడానికి అర్హులని పేర్కొన్నారు. గతంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.8 లక్షలు మంజూరు చేసిందని, ఇప్పుడు అదనంగా ఎస్సీ బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీలకు లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 17,749 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, వీటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీవీటీజీలకు సంబంధించి 13,548 మందికి రూ.70.04 కోట్లు సహాయం అందుతుందని చెప్పారు. కాగా మే నెలాఖరు నాటికి 13,687 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు.

'జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తరలిరండి'



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

రాంబిల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈ నెల 14న జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురం బుధవారం ఆయన ఎలమంచిలి నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న సేవలను దేశవ్యాప్తంగా కొనియాడుతున్నారన్నారు. తన సొంత నిధుతో సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజా మన్ననలు పొందుతున్నారని వివరించారు. పండుగలా నిర్వహిస్తున్న పార్టీ ఆవిర్భావ వేడుకలకు అంతా తరలిరావాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో జనసేన రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి రూరల్ మండల శాఖల అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, బాజ్జి, జనపరెడ్డి శ్రీనివాసరావు, శ్రీవేణిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'లలితా ఫెర్రో' ఎదుట కార్మికుల ఆందోళన



కర్మాగారం ముందు నినాదాలు చేస్తున్న కార్మికులు

అచ్యుతాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడున్న రాజరాజేశ్వరి లలితా ఫెర్రో కర్మాగారం వద్ద కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. విద్యుత్ బకాయిలు చెల్లించని కారణంగా జనవరి 23 నుంచి కర్మాగారానికి విద్యుత్ సరఫరాను ఆ శాఖ అధికారులు నిలిపివేశారు. అప్పటి నుంచి కర్మాగారాన్ని మూసివేశారు. కార్మికులకు రెండు నెలల జీతాలు బకాయిలున్నాయి. వాటిని వెంటనే చెల్లించాలంటూ కార్మికులు ఆందోళన చేయడంతో ఫిబ్రవరి 28 నాటికి పూర్తి బకాయిలు చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. అయిన చెల్లించకపోవడంతో ఈనెల పదో తేదీన మళ్లీ కార్మికులు కర్మాగారం వద్ద ఆందోళన దిగారు. దీంతో త్వరలో చెల్లిస్తామని నచ్చచెప్పడంతో వారు అంగీకరించారు. అయితే అనూహ్యంగా బుధవారం సుమారు ఇరవై లారీలు కర్మాగారం వద్దకు రావడంతో ఇది గమనించిన కార్మికులు ఆందోళన చేట్టారు. బకాయిలు చెల్లించే వరకు కర్మాగారంలోని సరకు బయటకు వెళ్లడానికి వీలు లేదని పట్టుబట్టడంతో చివరకు లారీలు వెనుదిరిగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము మాట్లాడుతూ కార్మికులను మోసగించి కర్మాగారంలో సరకును గుట్టుగా తరలించేందుకు యాజమాన్యం కుయుక్తులు పన్నుతోందని, ఇది సాగనివ్వమని స్పష్టం చేశారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆన్‌లైన్‌లో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఎంపీడీవో ఎం.ఉషారాణి బుధవారం తెలిపారు. ఎంపికైన వారికి యాభై శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు కానున్నట్టు చెప్పారు. అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

మడ అడవుల అభివృద్ధికి శ్రీకారం

» సీతపాలెం సమీప తీరం వద్ద మొక్కలు నాటి ప్రారంభించిన కలెక్టర్ విజయకృష్ణన్

రాంబిల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరు శివారు సీతపాలెం సమీపంలోని సముద్ర తీరం వద్ద వాస్క్ ప్రాజెక్టు సౌజన్యంతో ఉపాధి హామీ పథకం నిదులతో నిర్వహిస్తున్న మడ అడవుల అభివృద్ధి కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. సుమారు ఐదు ఎకరాల్లో మడ అడవుల అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా కలెక్టర్ పలువురు అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటే ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆమె పర్యవేక్షించారు. అనంతరం కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మడ అడవులు పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి ప్రసాదించిన వరాలన్నారు. తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచమైన మడ అడవుల అభివృద్ధిని ఈ ప్రాంతంలో తొలిసారిగా ఉపాధి పథకంలో చేపట్టడం అభినందనీయమన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, స్టేట్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్, డ్వామా పీడీ పూర్ణిమాదేవి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో జయమాధవి, క్లస్టర్ ఏపీడీ ఎరకయ్య, టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు లాలం చందు, వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, సర్పంచ్ గుణాకర్, ఉపాధి ఏపీవో శ్రీనివాసరావు, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.



సీతపాలెం సముద్ర తీరం వద్ద అధికారులతో కలిసి మొక్క నాటుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ముగిసిన శిక్షణ



శిక్షణ శిబిరంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు, శిక్షకులు

ఎలమంచిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెప్మా కార్యాలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.గోవిందరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం సంకల్ప పథకం ద్వారా ముప్పై మంది మహిళలకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించినట్టు చెప్పారు. చిన్న చిన్న వ్యాపారాలు సాగిస్తున్న డ్వాక్రా మహిళలు వ్యాపారంలో రాణించేలా మరిన్ని మెలకువలు నేర్పినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రతినిధి పద్మా, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

ఎలమంచిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సమీపంలోని కొక్కిరాపల్లి జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ ఓ లారీ బోల్తా పడింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళుతున్న లారీ కొక్కిరాపల్లి జంక్షన్ వద్ద ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. దీంతో వెంటనే స్థానికులు వెంటనే లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్, క్లీనర్‌లను బయటకు తీశారు. లారీ బోల్తా పడిన సమయంలో ఎటువంటి వాహన రాకపోకలు జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

నేడు మార్టూరులో నూకాలమ్మ పండుగ



అచ్యుతాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మార్టూరు గ్రామ ప్రజల ఇలవేల్పు నూకాలమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. సెజ్ పునరావాస కాలనీతో పాటు కర్మాగారాలను అనుకొని ఈ ఆలయం ఉండడంతో భారీ సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామన్నారు. రాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

ఎలమంచిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలిలోని కార్యాలయం వద్ద పట్టణశాఖ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర మునిసిపల్ వైస్ చైర్మన్ అర్రెపు నాగ త్రినాథగుప్తాతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యర్రయ్యదొర మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ పార్టీ లక్ష్యంగా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వైసీపీకి పూర్వ వైభవం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొఠారు కొండబాబు, కోడిగుడ్డు రమణబాబు, మడగల సత్యనారాయణ, పిల్లా త్రినాథ్, దుంగా అచ్యుతరావు, అప్పారావు, కిరణ్, పిట్టా సత్తిబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

అచ్యుతాపురం : వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఇక్కడ కోలాహలంగా జరుపుకున్నారు. తొలుత అచ్యుతాపురం జంక్షన్‌లో గల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశంశెట్టి శంకరరావు, లాలం రాంబాబు, నర్మాల కుమార్, మారిశెట్టి సూర్యనారాయణ, కోన బుజ్జి, పిన్నమరాజు వాసు, పంచదార్ల పైడిరాజు, కొమ్మోజు ఈశ్వరరావు, గంగూలీ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో వైఎస్ విగ్రహం వద్ద బొడ్డేడ ప్రసాద్ తదితరుల నివాళి

మునగపాకలో...

మునగపాక : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన వైసీపీకే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక నందీశ్వర ప్రాంగణం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద, క్యాంపు కార్యాలయం వద్ద వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, వైసీపీ నాయకులు ఆడారి గణపతి అచ్చింనాయుడు, దాసరి అప్పారావు, మద్దాల వీరునాయుడు, ఆడారి కాశీబాబు, బొడ్డేడ శ్రీను, భీశెట్టి గంగఅప్పలనాయుడు, కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో నూతన చాంబర్‌ను ప్రారంభించిన 'ప్రగడ'



మంత్రి భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ

ఎలమంచిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు నూతన చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి అభివృద్ధిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నట్టు ఇక్కడి విలేకరులకు ఆయన వివరించారు. అనంతరం పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్‌ను మర్యాదపూర్వకంగా ప్రగడ కలిశారు. నియోజకవర్గంలోని సెజ్‌లో గల పరిశ్రమల పురోగతితో పాటు నిర్వాసిత గ్రామాల ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు.

సీతా రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

ఎలమంచిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ దంపతులు, మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి.

న్యాయశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన



న్యాయశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి విజయ

ఎస్.రాయవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్డరోడు శ్రీప్రజ్ఞ డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాయశాస్త్రంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతీ ఒక్కరూ న్యాయశాస్త్రం గురించి తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, మహిళల పట్ల జరుగుతున్న నేరాలతో పాటు పోక్సో చట్టంపై అవగాహన, తీసుకోవలిసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎలమంచిలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ధూళి నూకరాజు, వైస్ ప్రెసిడెంట్ పీవీ రమణ, న్యాయవాది టి.నూకరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలపై ప్రత్యేక దృష్టిసారించండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

ఎస్.రాయవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు సూచించారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సక్రమంగా విధులను పాటించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో ఆయా పాఠశాలల పర్సెంటేజీలను అడిగి తెలుసుకోవడంతో పాటు ఉపాధ్యాయులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, లంకా సూర్యకళ, రమేశ్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపమాకలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పుష్కరిణిలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో శ్రీవారి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని పారిశుధ్య పనులు చేపడుతున్నారు. ఎంపీడీవో డి.సీతారామరాజు నేతృత్వంలో ఇతర పంచాయతీల నుంచి కూడా పారిశుధ్య సిబ్బందిని ఉపమాక జాతర కోసం నియమించారు. స్వామివారి పుష్కరిణి, ఉపమాక ఆలయం నుంచి ఎన్.నర్సాపురం, రాజయ్యపేట, జానకయ్యపేట, నక్కపల్లి, మనబాలవానిపాలెం గ్రామాలకు వెళ్లే రహదారులపైన, స్వామి వారి పుష్కరిణి, ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులను విస్తృతంగా చేపడుతున్నారు. ఈ పనులను సర్పంచ్ వీరబాబు, కార్యదర్శి జయప్రకాశ్ బుధవారం పర్యవేక్షించారు.

వెంకన్న సన్నిధిలో సదస్యం

» పుణ్యకోటి వాహనంపై కల్యాణ వెంకన్న తిరువీధి సేవ

నక్కపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో బుధవారం రాత్రి 9 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవాల్లో భాగంగా సదస్యం (పండితసభ) ఘనంగా జరిగింది. కల్యాణ వేదిక వద్ద ఉభయదేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడిని పుణ్యకోటి వాహనంపై అలంకరించి పండితసభను నిర్వహించారు. పాంచాహ్నిక దీక్ష, పాంచరాత్ర ఆగమానుసారం ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు, పవన్ కుమార్ తదితరులు చతర్వేద పారాయణంతో సదస్యం నిర్వహించారు. ప్రముఖ వేద పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. కలియుగంలో కల్కి అవతారంలో కొలువైన ఉపమాక వెంకన్నను దర్శించుకోవడం, స్వామి కల్యాణాన్ని తిలకించడం పూర్వ జన్మసుకృతమన్నారు. డాక్టర్ గాయత్రీదేవి సహా వేద పండితులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు, యువీఎస్ శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు పాల్గొన్నారు.



ఆలయంలో సదస్యం నిర్వహిస్తున్న అర్చకులు

అలాగే పండిత సభ అనంతరం పుణ్యకోటి వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడిని మాడవీధుల్లో ఊరేగించారు. మాడవీధుల్లో స్వర్ణాలంకరణలో వున్న స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీవారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం తోట ఉత్సవం జరుగుతుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొరుప్రోలు, ఎస్.రాయవరం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా ఎస్.రాయవరంతో పాటు వాకపాడు అక్వా పరిశ్రమ ప్రదేశాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, అలాగే కొరుప్రోలు సెక్షన్‌లోని చినఉప్పలంలో గల ఆక్వా ప్రదేశాలు, కొరుప్రోలులో ఉన్న కాయిల్ కంపెనీలతో పాటు గుడివాడ, గుర్రాజుపేట, లక్ష్మీపతిరాజుపేట, పెదఉప్పలం, కొత్తపోలవరం, రేవుపోలవరం, చినఉప్పలం, వాతాడ, బంగారమ్మపాలెం గ్రామాల్లో కూడా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ ఉండదని చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులంతా గమనించి తమకుసహకరించాలని ఈఈ కోరారు.

ప్రకృతి వ్యవసాయ గ్రామంగా కొత్తూరు

పాయకరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాంభద్రపురం కొత్తూరును శతశాతం ప్రకృతి వ్యవసాయ గ్రామంగా అభివృద్ధి చేసేందుకు సిబ్బంది కృషిచేయాలని వ్యవసాయశాఖాధికారి ఆదినారాయణ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వ్యవసాయ, వెలుగు, జెడ్‌బీఎన్ఎఫ్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి కమ్యూనిటీ మేనేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్‌పై అవగాహన కల్పించారు. మండలంలో శతశాతం ప్రకృతి వ్యవసాయం గ్రామంగా మార్చేందుకు రాంభద్రపురం కొత్తూరును ఎంపిక చేసినట్టు ఆయన చెప్పారు. గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీఎం దేవతారెడ్డి, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి కె.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నక్కపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల, చినదొడ్డిగల్లు, వేంపాడు, నక్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల తరగతి గదుల్లో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన బోధనా పద్ధతులను వివరించారు. బోధనోపకరణాలను తయారు చేసుకుని ప్రదర్శించాలని ఎంఈవో నరేశ్ సూచించారు. మెలకువలను మెరుగుపరచుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని రిసోర్స్‌పర్సన్లు ఎన్‌వీఎస్ ఆచార్యులు, కల్యాణి, శ్రీనివాసరావు చెప్పారు. హెచ్ఎంలు కవిత, సత్యారావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వైసీపీ ఆవిర్భావ వేడుకలు



పాయకరావుపేటలో జెండా ఎగుర వేసిన చిక్కాల

పాయకరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావ వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అభివృద్ధి మండలి చైర్మన్, వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంక సూరిబాబు పంచాయతీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్ఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, ధనిశెట్టి బాబి, చోడిపల్లి శ్రీను, కోట కోటేశ్వరరావు, దోమాడ సుందరం, పన్నీరు పాపారావు, పందిరి ధర్మాజీ, చేపల తాతాజీ, కేశనకుర్తి సత్తిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండల కేంద్రంలోని వైసీపీ కార్యాలయం వద్ద బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎంపీపీ రత్నం,జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ పాల్గొన్నారు. సారిపల్లివానిపాలెం వద్ద వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాతబాబు, గొర్ల బాబూరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కోటవురట్లలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు

కోటవురట్ల: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. దివంగత నేత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, సాగి సీతాబాబు, జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్తిబాబు, యల్లపు కుమార్‌రాజా, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

నక్కపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయిలో గురువారం నుంచి క్రికెట్ టోర్నమెంట్‌ను కూటమి నాయకులు నిర్వహించనున్నారు. స్థానికంగా వున్న హెటిరో మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 50 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని టీడీపీ నాయకులు చెప్పారు. బుధవారం సాయంత్రం హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద క్రికెట్ జట్ల కెప్టెన్ల సమక్షంలో టీడీపీ నాయకులు మ్యాచ్‌ల నిర్వహణకు అవసరమైన డ్రా తీశారు. గురువారం ఉదయం 8 గంటలకు తొలి మ్యాచ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, అబద్దం, పి.చిట్టిబాబు, జానకి శ్రీను, కొప్పిశెట్టిబుజ్జి, వైబోయిన రమణ, రాఘవులు, దార్ల కృష్ణ, గంగరాజు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉపాధి పథకం పనుల తనిఖీలు

కోటవురట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జల్లూరు పంచాయతీల్లో ఉపాధి పథకం పనులకు ఎంపీడీవో కాశీ విశ్వనాథం, ఏపీవో నాగరాజు బుధవారం తనికీలు చేశారు. జల్లూరుగ్రామంలో జరుగుతున్న చెరువు పూడిక తీతపనులకు పరిశీలించారు. అనంతరం కూలీల మస్తరు పరిశీలించి, వారితో మాట్లాడారు. రోజుకి ఎన్ని గంటలు పనులు చేస్తున్నారని, కూలి ఎంత గిట్టుబాటు అవుతుందని అడిగి తెలుసుకున్నారు. వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు అధికారులను వివరించారు. త్వరలోనే వేతనాల చెల్లింపులు జరుగుతాయని ఎంపీడీవో హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో సంపద కేంద్రాన్ని సందర్శించి వర్మీకంపోస్టు తయారు విదానాన్ని పరిశీలించారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

పాయకరావుపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రబీ వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ చెప్పారు. మండలంలోని మంగవరం, పెంటకోట గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగవరంలో రబీ వరి సాగు చేస్తున్న రైతులతో మాట్లాడి సస్యరక్షణ చర్యలు వివరించారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి అవగాహన కల్పించారు. రాయితీపై రైతులకు ప్రభుత్వం అందించే పనిముట్లు, ప్రోత్సాహకాలను తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సాగు, ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఆర్.సాధన, పి.సతీశ్, రైతులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోండి

పాయకరావుపేట రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఈవోపీఆర్డీ సి.హెచ్.చంద్రశేఖరరావు కోరారు. పాల్తేరు గ్రామంలోని సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. మహిళలకు తడి చెత్త, పొడి చెత్త గురించి అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శికి, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆచారి, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


ఆసీలు పాటదారుల నుంచి డిపాజిట్లు స్వీకరిస్తున్న అధికారులు

రోడ్డు మార్జిన్ ఆశీలు రూ.33.93 లక్షలు

జీఎస్టీతో కలుపుకొని చెల్లించాల్సింది రూ.40.03 లక్షలు

నర్సీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి మునిసిపాలిటీ రోడ్డు మార్జిన్ ఆశీలు పాట రూ.33.93 లక్షలకు ఖరారైంది. కార్యాలయం ఆవరణలో కమిషనర్ సురేంద్ర, రెవెన్యూ అధికారి నీలమ బుధవారం రోడ్డు మార్జిన్ ఆశీలు పాట నిర్వహించారు. మొత్తం 13 మంది రూ.5 లక్షలు సాల్వెన్సీ, రూ.3 లక్షలు చొప్పున డిపాజిట్లు చెల్లించి పాటలో పాల్గొన్నారు. కిల్లాడ దుర్గారావు రూ.33.93 లక్షలకు రోడ్డు మార్జిన్ ఆసీలు పాటను కైవసం చేసుకున్నారు. పాటదారు 18 శాతం జీఎస్టీ రూ.40,03,740 మునిసిపాలిటీకి చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. గత ఏడాది కంటే ఇప్పుడు రూ.1.08 లక్షలు అధికంగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించాలని ఆందోళన


రోడ్డు సదుపాయం కల్పించాలని నిరసన తెలుపుతున్న గిరిజనులు

మాడుగుల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాలకు బీటీ రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం శంకరం పంచాయతీలోని తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవలస, మామిడిపాలెం గిరిజన గ్రామాల గిరిజనులు ఆందోళనకు దిగారు. మోకాళ్లపై నిలొచ్చునిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ రోడ్డు సదుపాయంతో పాటు వంతెనలు, కాజ్‌వేల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్డు సదుపాయాలు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని వాపోయారు. అలాగే గర్భిణులను ఆస్పత్రికి తరలించాలంటే డోలీమోతలు తప్పడం లేదన్నారు. ప్రభుత్వ పెద్దలు కళ్లు తెరిచి గిరిజన ప్రాంతాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని విన్నవించారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, పార్టీ నేత కె.భవానీ పాల్గొన్నారు.

బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు


ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈవో అప్పారావునాయుడు

మాడుగుల రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు విద్యా బోధనపై శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. మాడుగుల, కింతలి, కేజే పురం స్కూల్ కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి నెలా మూడో శనివారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసి తదుపరి శిక్షణకు ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు. అమరావతి నుంచి నేరుగా ఐఎఫ్‌పీ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని ఆయన చెప్పారు. పదో తరగతి పరీక్షలు ఉన్నందున ముందస్తుగా బుధవారం శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేముడమ్మ, సీఆర్‌ఎంటీలు శారద, హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో ఏదైనా సాధ్యమే..


కళా వేదికపై బాలికల నృత్య ప్రదర్శన

చీడికాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యమేనని మాజీ ఎంపీపీ ప్రాత్రిని సింహాచలం నాయుడు అన్నారు. మండలంలోని తురువోలు హైస్కూల్ ఆవరణలో పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.5 లక్షలతో నిర్మించిన కళా వేదికను స్థలదాత కుటుంబీకుడు సింహాచలంనాయుడు, ప్రాత్రిని నారాయణమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 42 మంది పదో తరగతి విద్యార్థులకు ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పాటూరి వరహామూర్తి, మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, టీడీపీ యువ నేత ప్రాత్రిని సురేశ్ సంయుక్తంగా పరీక్ష కిట్‌లను అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జీపీఏ.నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

చీడికాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో తునివలస గ్రామంలో బుధవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి వేదపండితులు పూజలు, కల్యాణోత్సవాలు నిర్వహించారు. మహిళ కోలాటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాయంత్రం జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందించారు. డిప్యూటీ మాజీ సీఎం బూడి ముత్యాలనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, బీజేపీ జిల్లా నేత ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల హైమ, కోనాం జలాశయం వైస్‌చైర్మన్ కొట్యాడ చిన్నంనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు పాతాళం బాలకృష్ణ, మాజీ సర్పంచులు పేర కొండబాబు, పడాల అప్పలనాయుడు, పాల సంఘం అధ్యక్షులు పేరపు కొండబాబు, గండి ముసలినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

బుచ్చెయ్యపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వడ్డాది పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పూర్వ విద్యార్థులు పరీక్ష కట్లను అందజేశారు. అలాగే నోట్ పుస్తకాలు, అట్టలు, పెన్నులు, తాగునీటి సీసాలు పంపిణీ చేశారు. గురువు పి.సీతారామ్మూర్తిని సత్కరించారు. హెచ్‌ఎం టీవీ.శేషగిరి, నాయకులు దొండా నరేశ్, సన్యాసిరావు, రమణ, ఎస్.వరహాలదొర, మాధవరావు, సత్యనారాయణ, భాస్కరరావు, జి.మేఘూరావు, బైరి రామం పాల్గొన్నారు.

ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ... 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


మిల్లులో ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

నాతవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలో అదనంగా ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ తెలిపారు. మండలంలో ధాన్యం కొనుగోలు మధ్యలో నిలిపివేయడంతో రతులు దళారులకు అమ్ముకుంటున్నారని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ, పౌ సరఫరాల శాఖల అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో సందర్శించారు.అలాగే పొలాల్లో ఇంకా నూర్చకుండా ఉన్న ధాన్యం కుప్పలను కూడా పరిశీలించారు. అనంతరం నాతవరం రైతు సేవా కేంద్రంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ జిల్లాలో నాతవరం మండలంలోనే ఎక్కువగా ధాన్యం ఉన్నాయని చెప్పారు. ఫిబ్రవరి మొదటి వారంలో ధాన్యం కొనుగోలు నిలిపి వేయడంతో, ఇంకా వరి నూర్చని రైతుల నుంచి మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన స్పందించి అదనంగా ధాన్యం కొనుగోలుకు అనుమతి తీసుకువచ్చారని ఆర్డీవో తెలిపారు. దీంతో నాతవరం మండలంలోని ఎనిమిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను, వరి కుప్పలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఇంకా వరి కుప్పలు నూర్చకుండా ఉంచిన రైతులు ఈ నెల 25వ తేదీలోగా నూర్చి ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. ఈ విషయంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఉమాప్రసాద్, తహసీల్దార్ వేణుగోపాల్, పౌర సరఫరాల శాఖ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌కు రూ.35 కోట్లు ఇవ్వండి

సీఎంకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

చోడవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకునేందుకు తక్షణ సాయంగా రూ.35 కోట్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. ఈ లేఖను సీపీఎం నాయకులు డి.వెంకన్న, వి.వి.శ్రీనివాసరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఆర్.దేముడునాయుడు బుధవారం విడుదల చేశారు. ఈ నెల 10న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని సందర్శించిన శ్రీనివాసరావు, సహకార రంగంలో రాష్ట్రంలో మిగిలిన ఏకైక గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఆర్థిక సమస్యల కారణంగా బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఫ్యాక్టరీ ఆధునికీకరణకు రూ.110 కోట్లు, తక్షణ సాయంగా రూ.35 కోట్లు ఇచ్చి ఫ్యాక్టరీని నిలబెట్టాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రైతులు, కార్మికులు వీధినపడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

చీడికాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం వేతనదారులకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలంలో కొన్నెంపూడి, గొప్పూరు, గదబూరు గిరిజన గ్రామాల గిరిజన వేతనదారులు పని ప్రదేశంలో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు మాట్లాడుతూ మండలంలో సుమారు 11 వారాలుగా కోటి రూపాయల మేర బిల్లులు రావాల్సి ఉందని, దీంతో కూలీలు పస్తులతో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.కన్న బాబు, రాజు, సన్యాసమ్మ, కొండమ్మ, భవానీ, సీతమ్మ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు ఫ్యాన్ల వితరణ

దేవరాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడి కేజీబీవీ విద్యార్థులకు బుధవారం ఫ్యాన్లను వితరణ చేశారు. వీటిని ప్రత్యేకాధికారి సిహెచ్.భువనమాధురికి అందించారు. సత్య సాయి సేవా భక్తుడు రవిశంకరు నాలుగు, వాలేటి నాగరాజు, అల్లు సత్యమూర్తి ఆర్థిక సాయంతో ఒక్కొక్కటి చొప్పున ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ.రమణ, ఉపాధ్యక్షుడు కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

చీడికాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ వి.చిట్టినాయుడు కోరారు. బి.సింగవరంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని ఈ సందర్భంగా రైతులకు డాక్టర్ చిట్టినాయుడు సూచించారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండలంలో ఇప్పటి వరకు 1680 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఖండివరం పశువైద్యాధికారి గణేశ్, సిబ్బంది శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

శతశాతం పన్నులు వసూలు చేయాలి

గొలుగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు ఈ నెలాఖరులోగా శతశాతం వసూలు చేయాలని ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువల్లో పూడిక తీసే పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని చెప్పారు.

పన్నుల వసూళ్లపై ఎంపీడీవో సమావేశం

మాడుగుల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పన్నుల వసూళ్లపై ఎంపీడీవో కొంకి అప్పారావు బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంజీఎన్‌ఆర్‌ఈసీ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులో పన్నుల వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు సంబంధించి రోజువారి రూ.300 కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని ఆయన చెప్పారు.

గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలి

నాతవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వల్సంపేట పంచాయతీ శివారు ఉటమళ్ల, తాళ్లపాలెం గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు కోరారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాధి పనులు లేవని ఉటమళ్ల, తాళ్లపాలెం గిరిజనులు చెబుతున్నారన్నారు. అలాగే 2016లో సిరిపురం-యరకంపేట రొడ్డుకు సంబంధిత కాంట్రాక్టర్ మెటల్‌వేసి మధ్యలో వదలివేశాడని, దీంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే రోడ్డు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని, జీడిమామిడి పంటకు మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

ఐదుగురు పందెం రాయుళ్ల అరెస్టు

రోలుగుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుసర్లపూడిలో బుధవారం కోడి పందెం శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగుర్ని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. గ్రామ శివారున కోడి పందేలు ఆడుతుండగా సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, నాటు కోళ్ళ, నగదు రూ.1520 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఎనిమిది మద్యం సీసాల స్వాధీనం

కృష్ణాదేవిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురంలో బెల్టు దుకాణంపై దాడిచేసి ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వై.తారకేశ్వరావు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలావున్నాయి. సిహెచ్.నాగాపురం గ్రామానికి చెందిన జి.బుచ్చిబాబు బెల్టషాపు నిర్వహిస్తున్నట్టు అందిన ఫిర్యాదుతో దాడి చేయగా అతని వద్ద ఎనిమిది మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో సారా విక్రయాలు, బెల్టషాపులు నిర్వహిస్తే 9440904240 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ


బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుని వైద్యం సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కును చోడవరం ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్.రాజు బుధవారం అందజేశారు. మండలంలోని కేపీ.అగ్రహారం గ్రామానికి చెందిన జొన్నపల్లి నాగరాజు కుమారుడు తేజ అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం సేవలు పొందుతున్నాడు. తమ కుమారుడు తేజను ఆదుకోవాలని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకువెళ్లారు. బాలుడు వైద్యానికి అవసరమయ్యే చెక్కును సీఎం సహాయనిధి ద్వారా ఎమ్మెల్యే మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు, నాయకులు వి.అప్పారావు, అద్దూరి శ్రీను పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం


నర్సీపట్నంలో గణేశ్‌కు కేక్ తినిపిస్తున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం/చోడవరం/చీడికాడ/దేవరాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. పెదబొడ్డేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ పార్టీ జెండాని ఎగరవేశారు. కేక్ కట్ చేసిన నాయకులకు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, సీనియర్ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసి పాత్రుడు పాల్గొన్నారు. అలాగే చోడవరంలోని కొత్తూరు జంక్షన్, పార్టీ కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్న ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం కొత్తూరు జంక్షన్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, దొండా రాంబాబు, ఎంపీపీ గాడి కాసులమ్మ, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు పుల్లేటి వెంకటేశ్, చందు రాంబాబు, బొడ్డేడ సూర్యనారాయణ, నెహ్రూ, కోన చంద్రరరావు, డీవీఆర్, దేవరపల్లి సత్య పాల్గొన్నారు.

దేవరాపల్లిలో డిప్యూటీ మాజీ సీఎం బూడి ముత్యాలనాయుడు రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం వైసీపీ చేస్తుందన్నారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు పాల్గొన్నారు.

చీడికాడలోని వరహాపురం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చుక్క అప్పలనాయుడు, జి.చిన్నమ్మలు, సీడీసీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పి.మహేశ్, పి.రామారావు, రమణబాబు, కె.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


చోడవరంలో పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న నాయకులు

ఎన్‌ఆర్‌ఐకి ఆదివాసీల భూములు

ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు అజయ్‌కుమార్ ఆరోపణ

గొలుగొండ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను ఎన్‌ఆర్‌ఐకి ఆన్‌లైన్ చేశారని ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పీఎస్.అజయ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం గదబపాలెం గ్రామానికి చెందిన ఆదివాసీలు, అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో పాతమల్లంపేట రెవెన్యూ గ్రామంలో సర్వే నంబరు 850లో 36 ఎకరాలు భూమిని 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని చెప్పారు. వీటిపై హక్కులు తమకే ఉన్నాయంటూ 2022లో గిరిజన నాయకుల ఆధ్వర్యంలో 20 రోజుల పాటు ధర్నా చేపట్టినట్టు చెప్పారు. దీనిపై పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపట్టామని చెప్పారు. ఇదంతా తెలిసినా రెవెన్యూ అధికారులు ఎన్‌ఆర్‌ఐకి సహకరించి ఆన్‌లైన్ చేయడం సరికాదన్నారు. గిరిజనులకు సాగు హక్కు కల్పించేవరకూ పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో తక్షణమే ఎన్‌ఆర్‌ఐ పేరు తొలగించాలని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బి.కింతాడలో చెరకు రైతుల వాగ్వాదం


చెరకు కాటా వద్ద బాహాబాహీకి దిగిన రైతులు

దేవరాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడ చెరకు కాటా వద్ద బుధవారం రైతులు బాహాబాహీకి దిగారు. గోవాడ చక్కెర కర్మాగార వ్యవసాయాధికారి కృష్ణమూర్తి సమక్షంలో ఈ ఘటన జరిగింది. కర్మాగారానికి బి.కింతాడ చెరకు కాటా దగ్గర నుంచి గతంలో లారీల్లో చెరకు తరిచేంవారు. ప్రస్తుతం గోవాడ నుంచి చెరకు లారీలు రాకపోవడంతో ప్రతి రోజూ చెరకు తెచ్చిన ట్రాక్టర్లు సీరియల్ ప్రకారం బి.కింతాడ దగ్గర 25 వరకు ఉన్నాయి. కాటా దగ్గర పనిచేస్తున్న సిబ్బంది వాటికి సీరియల్ ఇస్తారు. మంగళవారం మధ్యాహ్నం పది ట్రాక్టర్లు చెరకును పంపించాల్సిందిగా సమాచారం రావడంతో, ముందుగా సీరియల్ నంబర్లు ప్రకారం కాటా సిబ్బంది చెరకు ట్రాక్టర్లు తూనిక వెయ్యడానికి పిలిచారు. ఆ సమయంలో నంబర్లు పొందిన కొంత మంది లేకపోవడంతో మరికొంత మందిని వారి స్థానంలో పిలిచి గోవాడ చక్కెర కర్మాగారానికి పంపించారు. ఈ విషయం తెలుసుకున్న రైతు సీరియల్ ఉన్న ట్రాక్టరును కాకుండా వేరే ట్రాక్టరును ఏ విధంగా పంపిస్తారని సిబ్బందిని నిలదీశారు. దీనికి సమాధానం చెప్పే వరకు ట్రాక్టర్‌ను తూనిక కేంద్రం నుంచి తీసేది లేదని ఉంచాడు. పలువురు రైతులు సముదాయించడంతో వివాదం సద్దు మణిగింది.

ఇంటర్వ్యూ..

మార్కెట్ ఆదాయం లక్ష్య సాధనకు కృషి

-నీలాపు భవనేశ్వరి, సెక్రటరీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ



2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం రూ.2 కోట్లుగా నిర్దేశించాం. ఇప్పటి వరకు రూ.1.21 కోట్లు వచ్చింది. సరుగుడు, పసుపు, జీడి, రాజ్‌మా దిగుబడి తగ్గి పోవడంతో ఈ ఏడాది ఆదాయం పడిపోయింది. గడువు ఉన్నందున లక్ష్య సాధనకు శాయశక్తులా కృషి చేస్తున్నాం. నర్సీపట్నంలో రైతుబజారు ఏర్పాటు ప్రతిపాదన దశలో ఉంది.

ప్రశ్న: 2024-25 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్యం ఎంత? ఇప్పటి వరకు ఎంత వచ్చింది?

జ: రూ.2 కోట్లు లక్ష్యంగా నిర్దేశించాం. ఇప్పటి వరకు రూ.1.21 కోట్లు వచ్చింది. ఇంకా గడువు ఉన్నందున లక్ష్య సాధనకు శాయశక్తులా కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ఆదాయం పడిపోవడానికి కారణం ఏమిటీ ?

జ: సరుగుడు, పసుపు, జీడి, రాజ్‌మా దిగుబడి తగ్గి పోవడంతో ఈ ఏడాది ఆదాయం పడిపోయింది.

ప్రశ్న: టమాటా ధర పడిపోయి రైతులు నష్టపోతున్నారు. నష్ట నివారణ కోసం మార్గాలు ఏమైనా ఆలోచించారు?

జ: గొలుగొండ మండలంలోని కేఎల్ పురంలో రైతుల దగ్గర నుంచి టమాటా కొనుగోలు చేసి విశాఖపట్నం రైతు బజారుకు పంపించాం. ఇప్పుడు మార్కెట్లో ధర బాగానే పలుకుతున్నది.

ప్రశ్న: వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: ఇంకా ఏమీ లేదు. ముందుగా మార్కెట్ కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఏఎంసీ చైర్మన్ ప్రతిపాదనల మేరకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు వేగవంతమవుతాయి.

ప్రశ్న: నర్సీపట్నంలో రైతుబజారు ఏర్పాటు ఎంత వరకు వచ్చింది?

జ: ప్రతిపాదనల దశలో ఉంది. రైతు బజారు ఏర్పాటు అవసరంపై కమిషనర్ కూడా మాట్లాడారు.

-నర్సీపట్నం, ఆంధ్రజ్యోతి

16న చెస్ పోటీలు

మాకవరపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16న చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు చెస్ అకాడమీ సభ్యుడు సుధీర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. విజేతకు రూ.33 వేల నగదు బహుమతి అందిస్తామని, మరిన్ని వివరాలకు క్రీడాకారులు 9676514520 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నీటి కుంటలను సద్వినియోగం చేసుకోండి

మాకవరపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. మండలంలోని బూరుగుపాలెం, పైడిపాల గ్రామాల్లో బుధవారం ఉపాధి పనులు, నీటి కుంటలను పరిశీలించారు. ఉపాధి పథకంలో ప్రతీ రైతు నీటి కుంటలు తవ్వుకోవాలని సూచించారు. వీటి ద్వారా వర్షం నీటిని పొదుపు చేసుకుని పంటలకు ఉపయోగించుకోవచ్చన్నారు. మండలంలో ఈ ఏడాది 425 నీటి కుంటలు తవ్వేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ఇప్పటివరకు 80 కుంటలు పూర్తి చేశామని చెప్పారు. అనంతరం పైడిపాల సచివాలయాన్ని సందర్శించి, ప్రజలకు సక్రమంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో అన్నసమారాధన

చోడవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో కార్మికులు, రైతులకు బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. ఏటా క్రషింగ్ సీజన్ ప్రారంభం రోజున ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభం రోజున నిర్వహించలేదు. క్రషింగ్‌కు వరుస అవాంతరాలు కలుగుతున్న నేపథ్యంలో బుధవారం గుడిలో పూజలు చేసి, అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎండీ సన్యాసినాయుడు, గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు భాస్కరరావు, అధికారులు భోజనాలు వడ్డించారు.

వివాదాలకు తావు లేకుండా ఉత్సవాలు జరుపుకోండి

రోలుగుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుసర్లపూడిలో పెద్దింటమ్మ జాతరను శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ రామకృష్ణారావు సూచించారు. బుధవారం గ్రామంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ అప్పలనాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు: ఎంపీడీవో



రింతాడ గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయం ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం సంకాడ, రింతాడ గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రింతాడ-2 సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీఆర్వో, సర్వేయర్ విధులకు హాజరుకాకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఉద్యోగులు సమయ పాలన పాటించడంతో పాటు విధిగా విధులకు హాజరుకావాలన్నారు. సంకాడ ఎస్‌డబ్ల్యూపీసీలో వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. అనంతరం గ్రామంలో ప్రజలకు తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ పటిష్ఠంగా అమలు

చింతపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణ్ భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పటిష్ఠంగా అమలు పరచాలని సమగ్ర శిక్ష ఏఎంవో కె. భాస్కరరావు అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర-1 స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఏఎంవో సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కనీస సామర్థ్యాల్లో ప్రతిభ చూపాలన్నారు. ప్రధానంగా తెలుగు, గణితం, ఆంగ్లం పాఠ్యాంశాల్లో పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 పీబీవీవీవీ ప్రసాద్, ఎంఈవో-2 గెమ్మెలి బోడంనాయుడు, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సాగిన రామరాజుపడాల్, స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి కుడుముల వెంకట రమణ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వినియోగదారుల సంఘం అధ్యక్షుడు

పెదబయలు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు తెలిపారు. బుధవారం మండలంలో సీకరి జీటీడబ్ల్యూ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 15న వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. తూనికలు, కొలతల్లో మోసాలు, కల్తీల అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యుడు శివప్రసాద్ మాట్లాడుతూ వస్తువులు నాణ్యత,వస్తువుల ఎంపిక చేసుకొని హక్కు ప్రతీ వినియోగదారునికి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చలపతి, వైస్ ఎంపీప పీవీ ఎన్ కుమార్, సోమేశ్, నాగరాజు పాల్గొన్నారు.

'వైసీపీ నేతలు అభివృద్ధి పనుల్లో భాగం కావాలి'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డుంబ్రిగుడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పనికివచ్చే అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు అన్నారు. స్థానిక కిడారి భవన్‌లో ఆ పార్టీ శ్రేణులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీకి వెళ్లకుండా వైసీపీ ఎమ్మెల్యేలు రాజకీయం చేయడం సరికాదన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి, పన్నులతో జీతాలు తీసుకున్న ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయని, దీన్ని చూసి ఓర్వలేని వైసీపీ రాజకీయం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్, జక్కయ్య, కుమార్, నర్సు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికాకూడదు



విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి గురికాకూడదని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక కొత్తూరు గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు తహసీల్దార్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదువుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాలు ముందుగా చేరుకోవాలన్నారు. ఓఎంఆర్ షీట్‌లో హాల్ టికెట్ నంబరు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు.

రూ.లక్షలు వ్యయం.. లక్ష్యానికి దూరం

- శ్మశానవాటికలో జీసీసీ గిడ్డంగి నిర్మాణం
- ఎనిమిదేళ్లుగా వృథాగా భవనం



కొయ్యూరు సమీపంలో శింగవరంలో వృథాగా వదిలేసిన గిడ్డంగి

కొయ్యూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని శింగవరం వద్ద శ్మశాన వాటికలో జీసీసీ ఎంఎల్ఎస్ (నిత్యావసర సరకుల నిల్వ చేసేందుకు వీలుగా) గిడ్డంగిని నిర్మించటంతో అది గత ఎనిమిదేళ్లుగా వృథాగా పడి ఉంది. డీఆర్ డిపోలకు నిత్యావసర సరకుల పంపిణీని అందుబాటులోకి తీసుకువచ్చి జీసీసీకి రవాణా చార్జీలను తగ్గించాలనేది ఈ గిడ్డంగి ప్రధాన ఉద్దేశం. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లనుంచి రూ. 26 లక్షలు 2018లో నిధులు మంజూరు చేశారు. అయితే, అధికారులు, ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది అనాలోచితంగా ఈ గోదాంను రక్షణలేని ప్రాంతమైన శింగవరం శ్మశానవాటిక వద్ద నిర్మించారు. మండలంలో డీఆర్ డిపోలకు నిత్యావసర సరకులు సరఫరాకు ప్రస్తుతం అనకాపల్లి జిల్లా కృష్ణాదేవీపేటలో జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్ ఉంది. ఈ గిడ్డంగి నుంచి కొన్ని డిపోలకు సరకులు రవాణా జీసీసీకు ఇబ్బందిగా మారడంతోపాటు రవాణా వ్యయం కూడా రెండింతలవుతోంది. ఈ నేపథ్యంలో ఆరు పంచాయతీల పరిధిలోని డీఆర్ డిపోలతోపాటు మండల కేంద్రానికి సుదూర పంచాయతీలైన యు.చీడిపాలెం, మఠం భీమవరం పంచాయతీల పరిధిలోని డిపోలకు అందుబాటులో కొయ్యూరులో ప్రత్యేకంగా గిడ్డంగి నిర్మించారు. అయితే, స్థానిక తహసీల్దారు కార్యాలయం వెనుక సుమారు 10 ఎకరాల ప్రభుత్వ స్థలం, కాకరపాడులో ప్రభుత్వ స్థలం ఉంది. వీటిని కాకుండా మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలోని శింగవరం శ్మశానానికి అను కుని ఉన్న కనీస రక్షణ లేని ప్రదేశంలో గిడ్డంగి నిర్మించారు. ప్రధాన రహదారికి సమాంతరంగా కాకుండా లోతు ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో ప్రధానంగా ఈ గిడ్డంగిలో సరకులకు రక్షణ ఉండదు. వర్షాకాలంలో గిడ్డంగి వద్దకు వెళ్లేందుకు రహదారి లేదు. దీంతో గిడ్డంగి నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా రూ. లక్షలు వెచ్చించిన ఈ భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే ప్రారంభానికి నోచకుండానే శిథిలావస్థకు చేరే పరిస్థితి నెలకొంటుంది.

కరాటే పోటీల్లో పతకాలు



కరాటే పోటీల విజేతలతో తలారిసింగి పాఠశాల హెచ్‌ఎం, పీడీ

పాడేరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):విజయనగరంలో ఈ నెల 9వ తేదీన జరిగిన అంతర్ జిల్లా కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో అల్లూరి జిల్లా నుంచి షోటోకన్ కరాటే అకాడమీ తరఫున తరఫున పాల్గొన్న చిన్నారులు 11 గోల్డ్ మెడల్స్, 3 సిల్వర్ మెడల్స్ సాధించినట్టు కరాటే మార్షల్ ఆర్ట్స్ జిల్లా కోచ్‌లు ఎస్.రాజేశ్, ఎన్.రామారావు తెలిపారు. ఈ పోటీల్లో పాడేరులోని గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల, తలారిసింగి విద్యార్థులు చోడేపల్లి జగన్ (4వ తరగతి), సీదరి జోసెఫ్ (5వ తరగతి), సాగెని సంతోష్ (5వ తరగతి), పోతుని దేవేంద్ర కుమార్ (6వ తరగతి), సాగెని ఉమామహేశ్ (7వ తరగతి) గోల్డ్ మెడల్స్‌ను సాధించగా... సాగెని సింహాద్రి (5వ తరగతి), నమరెడ్డి సంజు(5వ తరగతి) సిల్వర్ మెడల్స్ సాధించినట్టు వారు వివరించారు. ఈ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మన్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ముంచంగిపుట్టులో కనిష్ఠ 23.5, గరిష్ఠ 32.1 డిగ్రీలు

పాడేరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మన్యంలో వాతావరణంలో మార్పులతో ఉష్ణోగ్రతలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. దీంతో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం పెరుగుతున్నాయి. బుధవారం ముంచంగిపుట్టులో కనిష్ఠ 23.5, గరిష్ఠ 32.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఎండ ఒక మోస్తరుగా కాస్తుండగా పగటి వేళల్లో వేడి ప్రభావం చూపుతుండగా రాత్రి వేళల్లో చల్లదనం కొనసాగుతున్నది. బుధవారం అరకులోయలో 11.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా... హుకుంపేటలో 12.1, చింతపల్లిలో 12.5, జి.మాడుగులలో 12.7, పాడేరులో 12.9, జీకేవీధిలో 13.1, పెదబయలులో 13.3, డుంబ్రిగుడలో 13.7, కొయ్యూరులో 17.7, అనంతగిరిలో 19.8, ముంచంగిపుట్టులో 23.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పాలిటెక్నిక్ నమూనా పరీక్ష



సీలేరు: ఆశ్రమ పాఠశాలలో పరిశీలిస్తున్న సీఐ వరప్రసాద్

సీలేరు, మార్చి 12 , (ఆంధ్రజ్యోతి): సీలేరు, గూడెంకొత్తవీధి పోలీస్టేషన్ల పరిధిలోని 5 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ప్రేరణ కార్యక్రమం ద్వారా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణకు మోడల్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా జీకేవీధి సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ, జీకేవీధి మండలం పరిధిలోని రెండు పోలీ స్టేషన్‌ల పరిధిలోని సీలేరు, ధారకొండ,రింతాడ, పెదవలస, జీకేవీధిలోని ఆశ్రమ పాఠశాలల్లోపదో తరగతివిద్యార్థులు పాల్గొన్నారన్నారు. పాలిటెక్నికల్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఓఎంఆర్ షీట్ ఏవిధంగా నింపాలి, పరీక్ష ఎంత సమయంలో రాయాలి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు సీఐ తెలిపారు.

గూడెంకొత్తవీధి: నమూనా పరీక్షలతో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన పెరుగుతుందని స్థానిక సీఐ వర ప్రసాద్ అన్నారు. బుధవారం జీకేవీధి బాలుర, బాలికలు, రింతాడ, పెదవలస, ధారకొండ, సీలేరు ఆశ్రమ పాఠశాలల్లో పోలీసులు శాఖ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు మోడల్ పాలీసెట్ పరీక్ష నిర్వహించారు. పాలీసెట్ దరఖాస్తు, ప్రవేశాల వివరాలు విద్యార్థులకు ముందుగా పోలీసుశాఖ ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అప్పలసూరి, రవీంద్ర పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలల్లో రక్తదాన శిబిరాలు

అరకులోయ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రిన్సిపాళ్లు డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, పట్నాసి చలపతిరావు తెలిపారు. అరకులోయ ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ డిగ్రీకళాశాల, మహిళా డిగ్రీ కళాశాలలో రెండు చోట్ల కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కళాశాలల విద్యార్థులతో పాటు బయట యువతీ, యువకులు రక్తదానానికి ముందుకు రావాలన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



పోలీసులు అదుపులో గంజాయి నిందితులు

కొయ్యూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మన్యం నుంచి మైదాన ప్రాంతానికి ద్విచక్రవాహనంపై తరలిస్తున్న ఆరున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ కిశోర్‌వర్మ తెలిపారు. బుధవారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు చీడిపాలెం కూడలిలో తనిఖీ చేశామన్నారు. విజయవాడ సిటీకు చెందిన దాకమర్రి ధన అరుణ్‌కుమార్, సాతులూరు వసంత విజయ్‌కుమార్ ఏజెన్సీలోని గ్రామాలలో గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ పంటల సాగుపై దృష్టి సారించాలి: ఏవో



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : గిరి రైతులు సంప్రదాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస బాబు అన్నారు. మండలంలోని బరడ పంచాయతీ బిమిడి గ్రామంలో బుధవారం పరివర్తన-అవగాహన సదస్సును నిర్వహించారు. గంజాయి సాగు, విక్రయాలతో కలిగే అనర్థాలను వివరించారు. గంజాయికి ప్రత్యామ్నాయంగా మామిడి, జీడి మామిడి, సిల్వర్ ఓక్, కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం తదితర పంటల సాగుపై దృష్టి సారించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు కె.అద్దు, కె.బిస్సునాథ్, కె.వెంకట్రావు, రైతులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు వద్దు

పెదబయలు: గంజాయి సాగు స్థానంలో వాణిజ్య పంటలను చేపట్టాలని ఏవో శ్రీనివాస్ కోరారు. బుధవారం అడుగులపుట్, కిముడుపల్లి సచివాలయాల పరిధిలోని బల్లపురాయి,గడుగుపల్లి, గాదేపల్లి, అరడగూడెం గ్రామాలలో సర్పంచి శోభరాణి,వార్డు సభ్యులతో కలసి సందర్శించి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా సిల్వర్‌ఓక్ మొక్కలను ప్రభుత్వం అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు శైలజ,లక్ష్మీ రైతులు పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగుల గ్రామ రహదారి పనులను బుధవారం సర్పంచి కె.త్రినాథ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతీయుల నిరసన, విజ్ఞాపనల మేరకు స్పందించిన ప్రభుత్వం రూ.194లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. దాదాపు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పూర్తయితే, ఉబ్బెంగులతో పాటు పలు గ్రామాలకు రాకపోకలకు సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ఎం.సత్యం, ఎంపీటీసీ సభ్యుడు వి.సాధురాం, తదితరులు పాల్గొన్నారు.

పచ్చి పసుపు కిలో రూ.21కు కొనుగోలు

చింతపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులనుంచి పచ్చి పసుపు కిలో రూ. 21కు కొనుగోలు చేస్తున్నట్టు థింసా ఆర్గానిక్ ఎఫ్‌పీవో సీఈవో వాడకాని దేవి ప్రవళిక తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. సాధారణంగా ఐదు కిలోల పచ్చి పసుపు కిలో ఎండు పసుపు అవుతుందన్నారు. ఎండు పసుపు సిద్ధం చేసేందుకు రైతులు అధికంగా శ్రమించాల్సివస్తుందన్నారు. దీంతోపాటు కూలీల ఖర్చు పెరిగిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక పద్ధతిలో పచ్చిపసుపుని మార్కెటింగ్ చేసుకుని అవకాశం ఎఫ్‌పీవో కల్పిస్తుందన్నారు. అందువల్ల గిరిజన రైతులు పచ్చిపసుపుని నేరుగా ఎఫ్‌పీవో ద్వారా మార్కెటింగ్ చేసుకోవచ్చునన్నారు. మార్కెటింగ్ సదుపాయం కోసం ఫోన్: 93470 42855, 70133 02422 నంబర్లకు కాల్ చేయవచ్చునన్నారు.

'బోయ వాల్మీకులను ఆదివాసీల జాబితాలో చేర్చొద్దు'



మాట్లాడుతున్న గిరిజన సంఘ నేతలు

అరకులోయ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశంలో తెలంగాణ బీజేపీ ఎంపీ డీకే అరుణ బోయవాల్మీకులను ఆదివాసీల జాబితాలో చేర్చాలని వ్యాఖ్యానించడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, పొద్దు బాలదేవ్ ఖండించారు. బుధవారం స్థానిక గిరిజన్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో వైసీపీ ప్రభుత్వం బోయవాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేకంగా శ్యామ్యూల్ ఆనంద్ కమిషన్ వేసి అసెంబ్లీల్లో తీర్మాణం చేసి కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. అలాగే, తెలుగుదేశం పార్టీ కారం శివాజీతో కమిషన్ వేసి అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి నివేదించిందన్నారు. ఇలా బీజేపీ, టీడీపీ, వైసీపీలు గిరిజనంకు అన్యాయం చేసేందుకు చేసేందుకు సిద్ధం కావడం దారుణమన్నారు. ఈ నిర్ణయాలపై సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష అసెంబ్లీలో గిరిజ నేతరులకు ఇళ్ల కోసం కోరడంపై అసంతృప్తిని వ్యక్తంచేశారు. సమావేశంలో సురేంద్ర, బుజ్జిబాబు, జగన్నాథం పాల్గొన్నారు.

రంపచోడవరం

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

పాడేరురూరల్: శాసనసభలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి గిరిజనేతరులకు పక్కా గృహాల మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలనడం ఆదివాసీల హక్కులకు ద్రోహం చేయడమే అవుతుందని ఏపీ గిరిజన సమాఖ్య హెచ్చరించింది. బుధవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎమ్మెల్యే శిరీషాదేవి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, ఆమె ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే శిరీషా దేవిని బహిష్కరించాలి

జి.మాడుగుల: రాజ్యాంగం కల్పించిన భూహక్కు చట్టం 1/70ని ధిక్కరిస్తూ గిరిజనేతరులకు పక్క గృహాల ఏర్పాటుకు వెసులుబాటు కల్పించాలని శాసన సభలో ప్రకటించిన రంపచోడవరం ఎమ్మెల్యే శిరిష దేవిని మన్యం నుంచి బహిష్కరించాలని డీఎల్‌వో నాయకులు కొండపల్లి కాంతారావు, కొర్ర మార్క్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సీఎం చంద్రబాబునాయుడును కలిసిన సివేరి అబ్రహం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రమిస్తున్న సివేరి అబ్రహం

హుకుంపేట మార్చి12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత సివేరి సోమ కుమారుడు, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు సివేరి అబ్రహం మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొన్నేళ్ల కిందట సివేరి సోమ మావోయిస్టుల చేతుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వం తమ కుటుంబానికి ఇచ్చిన హామీ పత్రాలను చంద్రబాబుకు అబ్రహం అందించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి తమ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చుతామని భరోసా ఇచ్చినట్టు అబ్రహం తెలిపారు. తమ తండ్రి బాటలో కష్టపడి పనిచేసి పార్టీ బలోపేతం చేయాలని సూచించారన్నారు. తమకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంపై అబ్రహం హర్షం వ్యక్తంచేశారు.

డిగ్రీ కళాశాలలో 3డీ ప్రింటింగ్‌పై శిక్షణ



శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గాయత్రీ విద్యాపరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అటానమస్ విశాఖపట్నం వారు చేతి వృత్తిలో భాగంగా 3డీ ప్రింటింగ్‌పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి 29వ తేదీ వరకు అందిస్తున్న శిక్షణను డిగ్రీ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి సూచించారు. బుధవారం శిక్షణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ పూర్తయిన తర్వాత భవిష్యత్తులో ఈ వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకునేందుకు వీలవుతుందన్నారు. ప్రొఫెసర్ డాక్టర్.ఎస్.దీపికారాణి మాట్లాడుతూ శిక్షణతోపాటు మార్కెటింగ్ మెలకువలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకుంటే పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్.డాక్టర్. వి.లీలారాణి,ఎన్ఎస్ఆర్.ప్రవీణ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో జి.గౌరీశంకరరావు, బి.దిలీప్ కుమార్, యు.వారిజ పాల్గొన్నారు.

యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పాడేరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సీడాప్ ద్వారా నిర్వహిస్తున్న జాబ్‌మేళా, శిక్షణ కార్యక్రమాలను జిల్లాలోని మైనారిటీ వర్గాలకు చెందిన యువత సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు షంసున్నీషా బేగం ఒక ప్రకటనలో కోరారు. సీడప్ వారి ద్వారా ఈ నెల 18వ తేదీన అరకువ్యాలీ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో, 28వ తేదీన పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాలలు నిర్వహించనున్నామన్నారు. ముస్లిం, క్రైస్తవ, సిఖ్, బౌద్ధ, జైన్ తదితర యువత అర్హతలను ఆధారంగా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. లేదా ఫోన్: 9849901159, 0891-2502271 నంబర్లకు సంప్రదించాలని ఆమె కోరారు.

ప్లాస్టిక్‌తో మానవ మనుగడకు ముప్పు



సంతలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

చింతపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంతో మానవ మనుగడకు పెనుముప్పు కలుగుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. బుధవారం చింతపల్లి వారపు సంతలో విద్యార్థులు, అధ్యాపకులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలుష్యం పెరిగిపోతుందన్నారు. ప్రజలు కేన్సర్ బారిన పడుతున్నారని, అందు వల్ల దీని వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి: సీపీఎం



ఉపాధి పనులు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

హుకుంపేట మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కూలీలకు బిల్లులు తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ నేతలతో కలిసి హుకుంపేట, సన్యాసంపాలెం, అడ్డుమండ ,బరమాసి పంచాయతీల్లో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులను పరిశీలించారు. చిడిపుట్టు వంతెన వద్ద వంతెన మరమ్మతులు చేయాలని ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనిముట్లు సమకూర్చాలన్నారు. తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి, డ్రైనేజీలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైమవతి, కృష్ణారావు, పడల్ రామారావు పాల్గొన్నారు.

జన్‌మన్ ఇళ్ల వ్యయం రూ. 5 లక్షలకు పెంచాలి

సీలేరు: పీఎం జన్‌మన్ పథకం ఇళ్ల నిర్మాణానికి అందిస్తున్న సాయం రూ. 5 లక్షలకు పెంచాలని జీకేవీధి మండలం గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు, సర్పంచి కాకూరి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. బుధవారం వారుప్రజా చైత్రయాత్రలో భాగంగా జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ ఆకులూరు గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలి: ఎస్ఐ



గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వరరావు

చింతపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం వామగెడ్డ గ్రామంలో గిరిజనులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాగే,వాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

కాఫీ సాగుపై శిక్షణ

పాడేరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.గొందూరు ల్యాండ్ స్కేప్ పరిధిలోని మద్దులబంద గ్రామంలో ఆర్‌వైఎస్ఎస్, సభల్ ప్రాజెక్టులో భాగంగా కాఫీలో యాజమాన్య పద్ధతులపై రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభల్ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కాఫీ తోటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. ఆర్‌వైఎస్ఎస్, వాసన్ సంస్థల ఆధ్వర్యంలో 100 మంది ఆదర్శ రైతులను గుర్తించి కాఫీ మోడల్ ప్లాంట్‌ల ద్వారా యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు. ఆర్‌వైఎస్ఎస్ ప్రతినిధి రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు సత్యనారాయణ, కాఫీ బోర్డు లైజన్ వర్కర్లు, వివిధ గ్రామాలకు చెందిన కాఫీ రైతులు పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం

- తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్ట ప్రకారం చర్యలు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు హెచ్చరిక
- నవోదయం-2 పేరిట ఉగ్గినపాలెంలో అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి, తదితరులు

కశింకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారు చేసి జీవితాలను పాడుచేసుకోవద్దని విశాఖపట్నం జోన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. మండలంలోని ఉగ్గినపాలెంలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామస్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. సారా ఎవరైనా తయారు చేస్తే నిర్భయంగా 14405 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అటువంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు అంతా సహకరించాలన్నారు. ఈ విషయంలో విద్యావంతులంతా నిరక్షరాస్యులను చైతన్యవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. అంతకు ముందు కళాజాత కళాకారులు సారా వల్ల అనర్థాలపై ప్రదర్శన ద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి వి.సుధీర్, ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మన్నాయుడు, ఎక్సైజ్ ఎస్ఐ గణేష్, కశింకోట పోలీసు స్టేషన్ ఎస్ఐ మనోజ్ కుమార్, గ్రామ సర్పంచ్ గున్నయ్యనాయుడులతో పాటు గ్రామ పెద్దలు సోమేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి' ఆధ్వర్యంలో రూరల్ స్పోర్ట్స్ మీట్



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సింహాద్రి సంస్థ హెచ్‌వోపీ సమీర్‌శర్మ

పరవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌వోపీ) సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. సింహాద్రి సామాజిక బాధ్యతలో భాగంగా లంకెలపాలెం హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన రూరల్ స్పోర్ట్స్ మీట్ 2024-25ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను నిరూపించుకునేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండల పరిధిలో గల 14 ప్రభుత్వ హైస్కూళ్లలో చదువుతున్న సుమారు ఐదు వందల మంది మంది విద్యార్థులకు హాజరయ్యారు. ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవంలో సింహాద్రి హెచ్ఆర్ విభాగం ఏజీఎం బీబీ పాత్ర, సీఎస్ఆర్ విభాగం హెచ్ఆర్ మేనేజర్ క్షేప్రకాశరావు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపవద్దు'

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ సోకినవారి పట్ల వివక్ష చూపరాదని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ అన్నారు. ఇక్కడి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు అవకాశాన్ని బట్టి సోషల్ వెల్ఫేర్ స్కీమ్స్‌లో అవకాశం కల్పించి వారిని ఆదుకోవాలన్నారు. ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్లు హేమ, ప్రీతి మాట్లాడుతూ హెచ్ఐవీ సోకినవారు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వ్యాధి సోకిన వారికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ ఎస్.గోవిందరావు, పీపీటీసీ కౌన్సిలర్ వీవీ ప్రసాదరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక జాతరకు ప్రత్యేక గుర్తింపుపై హర్షం



జీవో కాపీని అమ్మవారి పాదాల వద్ద ఉంచి రత్నాకర్, జయవీర్ పూజలు

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో పత్రాన్ని బాలాలయంలోని అమ్మవారి పాదాల వద్ద ఉంచి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, టీడీపీ యువ నాయకుడు దాడి జయవీర్ బుధవారం సాయంత్రం పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఆలయ ఈవో ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

- స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి కొరారి



రోష్ని అపరంజిని సన్మానిస్తున్న ఫార్మాసిటీ ఎండీ తదితరులు

పరవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో ముందుండి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పెషల్ ఎకనామిక్ జోన్ జాయింట్ కమిషనర్ (విశాఖపట్నం) రోష్ని అపరంజి కొరారి పిలుపునిచ్చారు. స్థానిక రాంకీ కమర్షియల్ హబ్‌లో విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలు రాణించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న పలువురు మహిళా ఉద్యోగిలను ఆమె ఘనంగా సత్కరించారు. అలాగే ఆయా సంస్థల ఉద్యోగులు కమిషనర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం. సునీత, విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ లాల్‌కృష్ణ, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె. శ్రీకాంత్, రాంకీ సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.


తుమ్మపాల : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాబార్డ్ జీఎం ప్రసాద్ అన్నారు. తుమ్మపాలలో గల ఎస్వీడీఎస్ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవంలో మాట్లాడారు. మహిళలంతా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం మహిళలకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం సుమంత్ కుమార్, ఉమెన్ అండ్ చైల్డ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంత లక్ష్మి, ప్రముఖ న్యాయవాది కుసుమ, ఎస్వీడీఎస్ కార్యదర్శి జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ప్రాకార సేవ



బేడా మండపంలో ఉత్సవమూర్తులకు ప్రాకార సేవ

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : దేము నిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవారి ప్రాకార సేవను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు పులకండం విజయ్‌బాబు, గిరిబాబు ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల మధ్య ఊరేగించి మంగళహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో టి.రాజసులోచన, పులకండం ప్రసాద్‌బాబు, రాజేష్, గోలి మురళీతో పాటు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం కావాలి

- జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జయప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జయప్రకాశ్

సబ్బవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.జయప్రకాశ్ సూచించారు. ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయుల క్లస్టర్, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత పెరగడమే అందరి లక్ష్యం కావాలన్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్‌కు గల కారణాలను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆరిపాక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, హెచ్ఎం తిరుపతిరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.



అనకాపల్లిలో వజ్రాభరణాల ఎగ్జిబిషన్

- అట్టహాసంగా ప్రారంభించిన మాజీ ఎంపీ బీవీ సత్యవతి
- రూ.2 లక్షలకు పైగా కొనుగోలు చేసిన వారికి లక్కీడ్రా కూపన్



ఎగ్జిబిషన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ సత్యవతి

కొత్తూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వసుంధర జ్యూయలరీ ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విజయా రెసిడెన్సీలో వజ్రాభరణాల ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభమైంది. మాజీ ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, డాక్టర్ హారిక ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ ఇప్పటి వరకు స్వర్ణాభరణాలు మాత్రమే చూశామని, మొట్టమొదటిసారిగా అనకాపల్లిలో వజ్రాభరణాల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. బుధ, గురువారాల్లో జరగనున్న ఈ ఎగ్జిబిషన్‌ను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వసుంధర జ్యూయలరీ వైస్ ప్రెసిడెంట్ టి.శ్రీదేవి మాట్లాడుతూ రెండు లక్షలకు పైగా కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికీ లక్కీ డ్రా కూపన్ ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కూపన్‌లన్నింటినీ డ్రా తీసి వారిలో విజేతకు ఒక డైమండ్ రింగ్ బహుమతిగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. కాగా, 'ఉమెన్ సపోర్ట్ ఉమెన్' అనే కాన్సెప్ట్‌తో ప్రముఖ డిజైనర్ శిరీషా చౌదరి 'సిరి అటెలియర్' అనే పేరుతో మహిళలకు సరికొత్త డిజైన్లతో వస్త్ర ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేశారని, వీటిని కూడా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. బుధవారం జరిగిన శాసన సభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-24 మధ్య జారీ చేసిన జీవో నెంబరు 535 ప్రకారం ఎవరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. ఇళ్ల స్థలాలు లేని జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలన్నారు. కొత్తగా రాజధాని నిర్మాణం జరుగుతుండడంతో ఎమ్మెల్యేలకు కూడా అమరావతి రాజధానిలో ఇళ్ల స్థలాలు కేటాయించేవిధంగా ప్రతిపాదనను పరిశీలించాలని కోరారు. దీనికి రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్య ప్రసాద్ సమాధానం ఇస్తూ.. కొన్ని న్యాయపరమైన చిక్కులున్నా జర్నలిస్టు లకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సీఎం దృష్టిలో పెడతామని తెలిపారు.



'జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న భీమరశెట్టి రామకృష్ణ

సబ్బవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో ఈనెల 14న జరగనున్న జనసేన ఆవిర్భావ వేడుకలను అంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారన్నారు. ఇటువంటి పార్టీ స్థాయిని మరింత పెంచేవిధంగా జనసైనికులు పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పిఠాపురం తరలిరావాల్సిందిగా కోరారు.

కొత్తూరు : జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని జన సైనికులంతా విజయవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పిఠాపురం వెళ్లేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దూలం గోపి, మంగా ఈశ్వర్, తాడి రామకృష్ణ, కర్రి సత్యనారాయణ, చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





నేడు పరవాడలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పరవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యల ప్రత్యేక పరిష్కార వేదికను ఇక్కడి జేఎన్‌పీసీ సబ్‌స్టేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ ఈ వేదిక ద్వారా వినియోగదారులు పరిష్కరించుకోవచ్చునని వివరించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం పదిన్నర గంటల నుంచి సాయం త్రం ఐదు గంటల వరకు వేదిక కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నేడు పి.బోనంగిలో దుర్గమాంబ పండుగ



పరవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పి.బోనంగి ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి పండు గను గురువారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఎట్టకేలకు డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడికతీత పనులను జీవీ ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది చేపట్టారు. 'బాబోయ్ దోమలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన వెనువెంటనే స్పందించారు. పలుచోట్ల కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించడమే కాకుండా రోడ్లపై నిలిచిపోయిన మురుగు నీటిని తోడించారు. అనంతరం దోమల నివారణ మందు స్ప్రేచేయించారు. .

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం




అనకాపల్లిలో కేక్ కట్ చేస్తున్న ముత్యాలనాయుడు, ధర్మశ్రీ తదితరులు

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కరణం ధర్మశ్రీ, యు.వి.రమణ మూర్తిరాజు, మలసాల భరత్‌కుమార్, డాక్టర్ బీవీ సత్యవతి, అదీప్‌రాజ్, మందపాటి జానకిరామరాజు, మళ్ల బుల్లిబాబు, లక్ష్మీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు కర్రి బాబు, నాయకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, కొటాన రాము, పాలిశెట్టి సురేష్‌రాజ్, ఎస్. ముత్యాలనాయుడు, దెడ్డం ప్రసాద్, దెడ్డం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.





పార్కు కాదు.. కైలాసభూమి!

నందన వనంలా నర్సీపట్నం శ్మశానవాటిక

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో మారిన రూపురేఖలు
- సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి



అంత్యక్రియలకు వచ్చిన వారు కూర్చోడానికి నిర్మించిన షెడ్లు, బెంచీలు

నర్సీపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): **శ్మశానవాటికలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉంటాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు, ఖర్మకాండలు చేయడానికి కైలాసభూమికి వెళ్లినవారు, అక్కడ ఎక్కువసేపు గడపడానికి ఇష్టపడరు. అయితే నర్సీపట్నంలోని బలిఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న శ్మశానవాటిక ఇందుకు భిన్నంగా వుంటుంది. వివిధ రకాల మొక్కలు, చెట్లు, పచ్చికబైళ్లతో ఉద్యానవనాన్ని తలపిస్తున్నది.**

నర్సీపట్నం ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నియోజక వర్గంలో రహదారులు, తాగునీరు, వైద్య, విద్యుత్ వంటి మౌలికరంగాల అభివృద్ధితో పాటు శ్మశానవాటికల రూపురేఖలు మార్చాలని భావించారు. అయితే వీటిని అభి వృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించే వెసులుబాటు లేకపో వడంతో జిల్లాలోని వివిధ కాంపెనీలు, ఫ్యాక్టరీలు, వ్యాపార సంస్థల యాజమాన్యాలతో మాట్లాడి సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు కేటాయించేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా బలిఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న నర్సీపట్నం శ్మశానవాటికను అభివృద్ధి చేయడానికి సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ ముందుకు వచ్చారు.



ఆస్థికలు భద్రపరిచే గది



శ్మశానవాటికలో పచ్చదనం మధ్య భారీ శివుడి విగ్రహం

పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం

శ్మశానవాటిక ప్రవేశమార్గం వద్ద స్థానిక మెడికల్ షాపు యజమాని కొప్పర్తి రామారావు గతంలో భారీ శివుని విగ్రహం ఏర్పాటు చేయించారు. ఇప్పుడు విగ్రహానికి రంగులు వేసి, చుట్టూ పచ్చదనం పెంచారు. లోపల నడక మార్గంలో టైల్స్ అమర్చి, ఇరువైపులా క్రోటన్స్ మొక్కలు నాటారు. దహనవాటిక భవనానికి మరమ్మతులు చేసి రంగులు వేశారు. శ్మశానవాటికు వచ్చే వారికి నీడ కోసం షెడ్డు, కుర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేశారు. అస్థికలు భద్రపరిచే గదికి మరమ్మతులు చేశారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. దహన సంస్కారాల అనంతరం జల్లు స్నానాలు చేయడానికి పైపులు బాగుచేయించారు. శ్మశానవాటికలోకి అడుగు పెడితే ఉద్యానవనంలోకి ప్రవేశిస్తున్న అనుభూతి కలిగేలా తీర్చిదిద్దారు.



బలిఘట్టంలో ఆధునీకరించిన శ్మశానవాటిక

కన్నుల పండువగా అనంత పద్మనాభుని తెప్పోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



కోనేరులో తెప్పపై విహరిస్తున్న అనంతపద్మనాభస్వామి

పద్మనాభం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభుని కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పద్మనాభంలో స్వామివారి తెప్పోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల జయజయ ధ్వానాల మధ్య గ్రామ బలిహరణ, విశేషహోమాలు జరిపారు. అనంతరం కుంతీమాధవ స్వామి ఆలయం నుంచి అనంత పద్మనాభుడు, ఉభయ దేవేరుల ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఉంచి ఊరేగింపుగా కన్నయ్య కోనేరు వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన అనంతపద్మనాభస్వామిని తెప్పలోని శేషవాహనంపై అధిష్ఠింపజేయగా భక్తుల జయ, జయధ్వానాల మధ్య కోనేరులో విహరించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవి

కశింకోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, ఎటువంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆమె కశింకోట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని సందర్శించి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. గురుకులంలోని భోజనశాల, వంటశాలను పరిశీలించారు.

ముందుగా అనకాపల్లి మండలం రేబాక మండలంలో ఉన్న స్టాకు పాయింటును తనిఖీ చేశారు. తుమ్మపాల రేషన్ షాపు, మొబైల్ పంపిణీ వాహనాన్ని తనిఖీ చేశారు. సరకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఆమె వెంట సివిల్ సప్లై, మహిళా శిశు అభివృద్ధి, పాఠశాల విద్య, ఫుడ్ సేఫ్టీ, తూనికలు, కొలతల శాఖాధికారులు పాల్గొన్నారు.



తాళ్లపాలెం గురుకుల కళాశాల మెస్‌లో స్టాకు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషన్ సభ్యులు దేవి

‘టాప్స్’ కోర్ గ్రూపులో ఎర్రాజి జ్యోతికి స్థానం

- 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్‌లో పతకమే లక్ష్యం



విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్)కు విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి ఎంపికైంది. కోర్, డెవలప్‌మెంట్ అనే రెండు గ్రూపులకు సంబంధించి దేశవ్యాప్తంగా 206 మంది క్రీడాకారులను క్రీడా మంత్రిత్వ శాఖ ఎంపిక చేయగా...కోర్ గ్రూపులో పీవీ సింధు, నీరజ్ చోప్రా, మనుబాకర్ వంటి ఒలింపిక్ మెడలిస్టులతోపాటు నగరానికి చెందిన జ్యోతికి స్థానం లభించింది. ఈ మేరకు జ్యోతికి కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి నెలకు రూ.50 వేలు ఉపకార వేతనం అందనుంది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకాలు అందించే సామర్థ్యం కలిగిన ఉన్నత క్రీడాకారులకు ఈ ‘టాప్స్’ కోర్ గ్రూపులో చోటు దక్కుతుంది.

రూటు మారిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ-లింగంపల్లి మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రాకపోకల మార్గం మారనున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి సికింద్రాబాద్, బేగంపేట మీదుగా కాకుండా, చర్లపల్లి-అమ్ముగుడ-సనత్‌నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805) ఏప్రిల్ 25 నుంచి ఉదయం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి సాయంత్రం 6.05 గంటలకు చర్లపల్లి, రాత్రి 7.40 గంటలకు లింగంపల్లి చేరుతుంది. లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) ఏప్రిల్ 26 నుంచి ఉదయం 6.15 గంటలకు లింగంపల్లిలో బయలుదేరి 7.15 గంటలకు చర్లపల్లి, రాత్రి 7.45 గంటలకు విశాఖ చేరనుంది. మిగిలిన స్టేషన్లు, హాల్ట్‌ల సమయాలలో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

సచివాలయాల ప్రక్షాళన

... 5వ పేజీ తరువాయి

సరైన పని ఉండడం లేదనే విమర్శలున్నాయి. తక్కువ మంది సిబ్బంది వున్న చోట పనిభారం అధికంగా వుంది. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్ది సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం జనాభా ఆధారంగా ఉద్యోగులను సర్దుబాటు చేయనున్నది. 3,500 మంది అంతకన్నా ఎక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు ఎనిమిది మంది సిబ్బంది వుంటారు. 2,500 నుంచి 3,500 వరకు జనాభా ఉంటే ఏడుగురు, 2,500 కన్నా తక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు ఆరుగురు వంతున ఉద్యోగులను కేటాయిస్తారు. ఇంజనీరింగ్, వ్యవసాయ శాఖల్లో టెక్నికల్ సిబ్బందిని రెండు సచివాలయాలకు ఒకరిచొప్పున సర్దుబాటు చేస్తారు. జనాభా ప్రాతిపదికన సచివాలయాల్లో ఉద్యోగులను సర్దుబాటు చేసిన తరువాత ఇంకా మిగిలి ఉన్న ఉద్యోగులను సంబంధిత శాఖలకు కేటాయిస్తారు.

వైసీపీ ‘యువత పోరు’

... 5వ పేజీ తరువాయి

వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, ఎ.అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్‌గణేశ్, కంబాల జోగులు, నాయకులు ఈర్లె అనురాధ, ఏడువాక సత్యారావు, బొడ్డేడ ప్రసాద్, మందపాటి జానకిరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పోరు వెలవెల

అనకాపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ‘యువత పోరు’ కార్యక్రమం వెలవెల బోయింది. యువత, విద్యార్థులు పాల్గొనాల్సిన ఈ కార్యక్రమంలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు మాత్రమే కనిపించారు. వారు కూడా పదుల సంఖ్యలోనే హాజరయ్యారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బేబీ ఫీడింగ్ సెంటర్

అనకాపల్లి టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పాసింజర్స్ ప్లాట్‌ఫారంలోని పాయకరావుపేట బస్సులు ఆగే స్థలం వద్ద బుధవారం బేబీ ఫీడింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను ఆర్టీసీ డీపీటీవో కె.పద్మావతి, విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ ఎండీ డాక్టర్ పీపీ లాల్‌కృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాంకీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధులు ఎం.వాసుదేవరెడ్డి, కె.శ్రీకాంత్, విశాఖ ఫార్మాసిటీ లైజన్ ఆఫీసర్ పి.రాఘవరెడ్డి, ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ప్రారంభించిన అధికారులు

బీఎన్ రోడ్డు విస్తరణకు సర్వే

... 5వ పేజీ తరువాయి

అయ్యే వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం భరిస్తాయి. మిగిలిన ఖర్చును ఎల్‌ఈఏ సంస్థ భరిస్తుంది. రోడ్డు విస్తరణ కోసం రెండు వైపులా ప్రభుత్వ, ప్రైవేటు భూములను గుర్తించి వివరాలు సేకరించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నాలుగు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రాల్లో 80 అడుగుల మేర, ఇతర ప్రాంతాల్లో వంద అడుగుల మేర మార్కింగ్ చేసి, ఆ మేరకు స్థలాల వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ స్థలం ఎంత, ప్రైవేటు స్థలం ఎంత, ఇవ్వవలసిన పరిహారం, ఇతర వివరాలను ఉజ్జాయింపుగా నమోదు చేయాలని సూచించారు.

ప్రజా ఉద్యమకారుడు నాగులాపల్లి కన్నుమూత

... 5వ పేజీ తరువాయి

కలిశారు. అప్పటి నుంచి రెండు దశాబ్దాలకుపైగా ఎన్నో భూపోరాటాలు చేసి దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయించారు. వీరి పక్షాన న్యాయస్థానాల్లో పోరాటం చేశారు. కూలీలు, కార్మికుల కోసం వ్యవసాయ కూలీ సంఘాన్ని స్థాపించి వారికి అండగా నిలిచారు. కొంతకాలం తరువాత తెలుగుదేశం పార్టీలో చేరి రాజాం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో బుచ్చెయ్యపేట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షునిగా పనిచేశారు. నాగులాపల్లి సత్యనారాయణ మృతి బడుగు, బలహీనవర్గాలకు తీరని లోటని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. బుచ్చెయ్యపేట జడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ప్రజా సంఘాల నేత కనకారావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు నాగులాపల్లికి నివాళులు అర్పించారు.

క్రైం... crime news

ప్రాణం తీసిన స్థల వివాదం



సన్యాసిరావు (ఫైల్ ఫొటో)

చోడవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ స్థలంలో దుకాణం ఏర్పాటు చేసే విషయంలో తలెత్తిన వివాదం ఓ వృద్ధుడి మరణానికి దారితీసింది. పట్టణంలోని పూర్ణా థియేటర్ సమీపంలో ఇందల సన్యాసిరావు (64) టైలరింగ్ సామగ్రి విక్రయించే దుకాణం నిర్వహిస్తున్నాడు. దీనిని వెనక్కు విస్తరించే విషయంలో పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త నేమాల హరితో వివాదం తలెత్తింది. ఈ నెల 3వ తేదీ రాత్రి ఇందల సన్యాసిరావు ఇంటి వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ రేగి కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో నేమాల హరి, సన్యాసిరావును బలంగా కొట్టడంతో తలకు గాయమై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి విశాఖ కేజీ హెచ్‌కు తరలించారు. సన్యాసిరావు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. సన్యాసిరావు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



చందక రాము(ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెనుగొల్లు గ్రామానికి చెందిన చందక రాము(58) ద్విచక్ర వాహనంపై నక్కపల్లి వెళ్లి తిరిగి వస్తూ జాతీయ రహదారిపై ఉన్న మలుపు తిరుగుతుండగా అదే మార్గంలో వెనుక నుంచి బైక్‌పై వస్తున్న అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన కె.కార్తీక్, జి.కుమార్ అనే యువకులు బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాము అక్కడికక్కడే మృతి చెందగా, ఆ ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా చందక రాము కుమార్తె మంగళవారం నక్కపల్లి ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించింది. దీంతో బుధవారం ఉదయం కుమార్తెకు ఇంటి నుంచి కాఫీ తీసుకువెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రమాదంలో మృతి చెందాడు. రాము ద్విచక్ర వాహనంపై గ్రామాల్లో తిరుగుతూ వస్త్ర వ్యాపారం చేస్తుంటాడు. అతని మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

100 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

డుంబ్రిగుడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాంకరవలస వద్ద వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్టు పాడేరు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాజారావు తెలిపారు. ఒడిశా నుంచి మండలంలోని కండ్రూం పంచాయతీ మీదుగా గంజాయి రవాణా అవుతున్నట్టు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో బుధవారం మధ్యాహ్నం మండలంలోని జాంకరవలస వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేట్టారు. ఈ క్రమంలో ఒడిశా వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపకుండా వేగంగా ముందుకు పోనిచ్చేందుకు డ్రైవర్ ప్రయత్నించాడు. పోలీసులు అప్రమత్తమై ఆటోను పట్టుకున్నారు. ఇందులో రవాణా చేస్తున్న వంద కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కితలంగి పంచాయతీ కిడంగుడ గ్రామానికి చెందిన సోభ లోకేశ్వరరావుగా గుర్తించి కేసు చేశారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు.

మహిళను బైక్‌తో ఢీకొని.. పుస్తెలతాడు చోరీ

పరవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళుతున్న ఓ మహిళను బైక్‌తో ఢీకొని ఆమె మెడలోని పుస్తెలతాడును ఆగంతకుడు చోరీ చేసిన ఘటన పరవాడలో బుధవారం సాయంత్రం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొర్లివానిపాలెం పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గొర్లి దేవి తన కుమారుడిని సెలూన్ షాపునకు తీసుకువెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరింది. పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఆమెను వెనుక నుంచి ఢీకొట్టడంతో కింద పడిపోయింది. వెంటనే ఆగంతకుడు ఆమె చేయి పట్టుకొని పైకి లేపే నెపంతో మెడలోని ఐదు తులాల పావు బంగారం పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419